# తపాలాశాఖలో పోస్టుల భర్తీకి సన్నాహాలు

## కాంట్రాక్టు ప్రాతిపదికన బీపీఎం పోస్టుల నియామకం

## -18 తరువాత నోటిఫికేషన్



**విశాఖపట్నం, న్యూస్‌లీడర్, జూలై 12:** తపాలాశాఖలో గల ఖాళీల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. విశాఖపట్నం డివిజన్ పరిధిలోని ఖాళీలను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేస్తారు. ఇందుకోసం తపాలాశాఖ విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో నోటిఫికేషన్ జారీ చేస్తారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుంది. మెరిట్ ఆధారంగా ఈ పోస్టుల భర్తీ వుంటుందని అధికారులు తెలిపారు. ఆయా పోస్టాఫీసులలో 90 వరకు బ్రాంచి పోస్టుమాస్టర్ పోస్టులు ఖాళీగా వున్నాయి. పదో తరగతి పాసయి, 18నుంచి 28 సంవత్సరాల వయసు గల అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులు. వేతనం రూ.15వేలు వుంటుంది. భీమిలి చిట్టివలస సబ్‌పోస్టాఫీసు పరిధిలోని చిప్పాడ, పెదనాగమల్లయ్యపాలెం, అన్నవరం బ్రాంచి పోస్టాఫీసులలో ఈ పోస్టులు ఖాళీగా వున్నాయి. అలాగే, అనకాపల్లి, చోడవరం, యలమంచిలి, నర్సీపట్నం తదితర ప్రాంతాలలో కూడా బ్రాంచి పోస్టుమాస్టర్ పోస్టులు ఖాళీగా వున్నాయి. గతంలో పనిచేసిన వారు ఉద్యోగోన్నతిపై వెళ్లిపోవడంతో పలు పోస్టులు ఖాళీ అయ్యాయి. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగానే పోస్టుల భర్తీ వుంటుందని తపాలాశాఖ అధికారులు తెలిపారు.

**విధులివే...**

బ్రాంచి పోస్టుమాస్టర్ పోస్టాఫీసులలో పలురకాల విధులు నిర్వహించాల్సి వుంటుంది. ముఖ్యంగా కొత్త ఖాతాలు తెరవడం వంటి విధులు వీరు నిర్వహిస్తారు. పోస్టాఫీసుకు వచ్చే ఖాతాదారులకు అవసరమైన సేవలు అందించాల్సి వుంటుంది. సాధారణంగా రోజుకు ఐదు గంటల వరకు మాత్రమే పని వుంటుందని అధికారులు తెలిపారు. తపాలాశాఖ అందిస్తున్న పథకాల గురించి ఖాతాదారులకు వివరించాల్సి వుంటుంది. కాగా, ఈనెల 18 వ తేదీ తరువాత నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు వున్నాయని అధికారులు తెలిపారు.